
సాక్షి పల్నాడు

ఆదివారం । 17 । డిసెంబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 522.40 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 835.10 అడుగుల వద్ద ఉంది.



అమరేశ్వరుని ఆదాయం

అమరావతి: అమరేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం హుండీల లెక్కింపు నిర్వహించగా, కార్తిక మాసంలో రూ.1.60 కోట్ల ఆదాయం లభించినట్టు ఈవో గోపీనాథశర్మ తెలిపారు.



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ దుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటం, శేషవస్త్రాలు అందజేశారు.

న్యూస్‌రీల్

ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబానికి రూ.7 లక్షల ఆర్థిక సహాయం



పెరికపాడు(క్రోసూరు): పెరికపాడు గ్రామానికి చెందిన రైతు ఆవుల వెంకట్రావు ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా, అతని కుటుంబానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆర్థిక సహాయం రూ.7 లక్షల చెక్కును శనివారం అందజేశారు. మృతుడి భార్య ఆవుల మల్లేశ్వరికి చెక్కు అందజేశారు. మరణించిన నాలుగు నెలలకే ఆర్థిక సహాయాన్ని అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావులకు రైతు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయండి

రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి

క్రోసూరు: విద్యార్థుల్లో ఒక్కొక్కరికి ఒక్కో విషయంపైన అద్భుతమైన జ్ఞానం ఉంటుందని, జ్ఞానాన్ని తూచే పరీక్షలు అరుదుగా ఉంటాయని, పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి అన్నారు. అచ్చంపేట, క్రోసూరు మండలాల్లో ఆయన శనివారం పర్యటించారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. క్రోసూరు జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల పట్ల ఓ సానుకూల వాతావరణాన్ని విద్యార్థుల్లో నెలకొల్పారు. విద్యార్థులకు చక్కటి సలహాలు, సూచనలు ఇచ్చి వారిలో భయాందోళనలు తొలగించారు. మార్చి 18వ తేదీ నుంచి జరిగే పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా ఆరులక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. రెండు మండలాల్లోని విషయ నిపుణులతో పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించటం ఏలా అనే అంశంపై మాట్లాడించారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుడు చిల్కా సురేష్‌బాబును అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తులసి సౌజన్య, బాబురావు, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాసం పూజలు



అమరావతి: వైష్ణవ ఆలయాలలో ఆదివారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల రోజుల పాటు ప్రతిరోజూ గోదాదేవికి తిరుప్పావై పాశురాలను ప్రవచించి అమ్మవారికి వివిధ రకాల పుష్పాలతో పూజలు నిర్వహించటం ధనుర్మాస విశిష్టతగా చెబుతారు. మండలంలోని వైకుంఠపురం, అమరావతి, కోదండరామాలయం, పాండురంగస్వామి ఆలయం, మల్లాది వటవృక్షాంతర్గత వేంకటేశ్వరస్వామి ఆలయాలలో ధనుర్మాస పూజలు నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు రేషన్ బియ్యం పంపిణీ

నరసరావుపేట: జిల్లాలోని ప్రతి సచివాలయం వద్ద ఆదివారం ఎండీయూ వాహనాల ద్వారా ప్రజాపంపిణీ వ్యవస్థలో నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ శనివారం తెలిపారు. ఇప్పటికీ సరుకులు తీసుకోని రైస్‌కార్డుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైబర్ వల..యువత విలవిల

- జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు
- లింక్స్ పంపి ఖాతాలు ఖాళీ
- ఆన్‌లైన్ సంపాదన పేరుతో లూటీ
- అవగాహన ఉన్నా మోసపోతున్న యువత
- వెంటనే ఫిర్యాదు చేస్తే నగదు రికవరీకి అవకాశం
- అపరిచిత వ్యక్తులు, సందేశాలతో జాగ్రత్తగా ఉండాలన్న ఎస్పీ రవిశంకర్ రెడ్డి



సాక్షి, నరసరావుపేట: నరసరావుపేట పట్టణానికి చెందిన ఓ యువతి భర్తతో విడిపోయిన తర్వాత బతుకుదెరువు కోసం ఏదైనా ఉద్యోగం కోసం ఎదురు చూస్తోంది. ఇంతలో తన మొబైల్‌కు వర్క్ ఫ్రం హోం ద్వారా పార్ట్‌టైం వర్క్ చేస్తూ ఇంటి వద్దే సంపాదించుకోవచ్చని మెసేజ్ వచ్చింది. టెలిగ్రాం లింక్ పంపి దాని ద్వారా కనెక్ట్ అవ్వాలని సూచించారు. తర్వాత గూగుల్ మ్యాప్ ఓపెన్ చేసి హోటళ్లకు ర్యాంకింగ్ ఇవ్వాలని, వీడియోస్ చూసి లైక్ చేసి ఆ స్క్రీన్ షాట్‌ను గ్రూప్‌లో షేర్ చేయాలని చెప్పారు. అలా చేస్తే టాస్క్‌కి కమీషన్ డిపాజిట్ చేస్తామని చెప్పారు. ఇలా వచ్చిన కమీషన్ రూ.10 వేలను విత్ డ్రా చేసుకునే అవకాశం లేకుండా చేశారు. ఆ యువతి వారితో టెలిగ్రామ్‌లో అడగగా.. నీ అమౌంట్ డిపాజిట్ చేయాలంటే యూపీఐ ద్వారా కొంతమేర డిపాజిట్ చేసి అన్‌లాక్ అయ్యాక విత్‌డ్రా చేసుకోమన్నారు. వారి మాటలు నమ్మి విడతల వారీగా సుమారు రూ.2 లక్షలు డిపాజిట్ చేయించుకోని సైబర్ నేరగాళ్లు ఆ యువతిని మోసం చేశారు. మోసపోయానని తెలుసుకున్న యువతి నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులను సంప్రదించి కేసు నమోదు చేయించారు. అయితే ఆ యువతి వారం రోజుల తర్వాత ఫిర్యాదు ఇవ్వడానికి రావడంతో కేసు నమోదు చేసి ఆ సైబర్ నేరగాడి బ్యాంక్ ఖాతాను ఫ్రీజ్ చేయడానికి చూస్తే అకౌంట్ ఖాళీ అయ్యింది. మోసపోయామని తెలిసిన వెంటనే సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేసి ఉంటే నగదు వెనక్కి వచ్చే అవకాశం ఉండేది. ఇలా చాలా మంది సైబర్ నేరగాళ్ల బారినపడిన తర్వాత ఏమి చేయాలో తెలియక ఇబ్బందిపడుతున్నారు.

సైబర్ నేరగాళ్లు ఏదో రూపంలో ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఫోన్లకు వచ్చే సందేశా(మెసేజ్)లకు కొందరు మోసపోతున్నారు. బ్యాంక్ అధికారులమంటూ వ్యక్తుల ఖాతాల్లోని నగదును మాయం చేస్తున్నారు. మరికొందరు ఉద్యోగాలు, కానుకల పేరిట ఆశచూపి వంచిస్తున్నారు. పరువు పోతుందని కొందరు, ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక కొందరు మిన్నకుండిపోతున్నారు.

ఉన్నత విద్యావంతులు సైతం...

సైబర్ నేరగాళ్లు రకరకాల మోసాలతో ప్రజలను బుట్టలో వేసుకొని డబ్బులు కొల్లగొడుతున్నారు. నిరక్ష్యరాస్యులు మోసపోయే ఆస్కారం ఎక్కువగా ఉండగా విచిత్రంగా విద్యావంతులు సాంకేతికతపై అవగాహన ఉన్న వారు సైతం సైబర్ నేరగాళ్ల వలకు అడ్డంగా దొరికిపోతున్నారు. ప్రధానంగా కస్టమర్ కేర్, నకిలీ ప్రకటనలు, ఉద్యోగాలు, పెట్టుబడులు పేరుతో ఎక్కువగా ప్రైవేట్ ఉద్యోగులు, యువత మోసపోతున్నారు. పల్నాడులో ఓ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆన్‌లైన్ గేమ్ పేరిట ఏకంగా



రూ.14 లక్షలకు పైగా మోసపోయి ఎస్పీ కార్యాలయం స్పందనకు వచ్చాడంటే సైబర్ నేరగాళ్ల పన్నాగాలు ఎలా ఉంటున్నాయో అర్థం చేసుకోవచ్చు.

పోలీసులు అప్రమత్తం చేస్తున్నా...

ఆన్‌లైన్ మోసాలపై ప్రజలను పోలీసులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. గ్రామాలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నా ఏదో రకంగా ప్రజలు మోసపోతూనే ఉన్నారు. సైబర్ నేరగాళ్లు యూపీ, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్ లాంటి ప్రాంతాలకు చెందిన వారు కావడంతో కేసులు నమోదు చేసినప్పటికి వాటిని ఛేదించడంలో సవాల్‌గా మారుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండటమే సైబర్ నేరాల నివారణకు మార్గమని చెబుతున్నారు.

సకాలంలో ఫిర్యాదు చేస్తేనే...

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు సకాలంలో ఫిర్యాదు చేస్తేనే సొమ్ము రికవరీకి అవకాశం ఉంటుంది. సైబర్ నేరాలపై 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. ఆ ఫిర్యాదు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సైబర్‌సెల్ నుంచి సమాచారం అందుతుంది, విచారణ తర్వాత పోలీసులు కేసు నమోదు చేస్తారు. సైబర్ నేరగాడి బ్యాంక్ ఖాతాలు తెలుసుకున్న పోలీసులు ఆ ఖాతాలను ఫ్రీజ్ చేసి కోర్టు ద్వారా నగదు తిరిగి రప్పించేలా చర్యలు తీసుకుంటారు. అయితే కొంతమంది మోసపోయిన వెంటనే 1930కి కాల్ చేయాలని తెలియకపోవడం, పరువుపోతుందనో ఆలస్యంగా ఫిర్యాదు చేయడం వల్ల సైబర్ నేరగాడు తస్కరించిన నగదును ఉపసంహరిస్తే ఆ తర్వాత చేసేదేమీ ఉండదు. దీంతో ప్రాథమిక దశలోనే వందల కేసులు ఆగిపోయి, ఎఫ్ఐఆర్ దశ వరకు రావడం లేదు.

జిల్లాలో మూడేళ్లుగా నమోదైన సైబర్ కేసుల వివరాలు	
సంవత్సరం	నమోదైన కేసులు
2020	59
2021	27
2022 (నవంబర్ నెల వరకు)	15

అప్రమత్తతతోనే సైబర్ నేరాల నివారణ



సైబర్ నేరగాళ్లు రోజురోజుకు కొత్త మార్గాల్లో నగదు తస్కరిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఈ నేరాలను అరికట్టగలం. ఇప్పటికే విద్యాసంస్థలు, సచివాయాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి అరికడుతున్నాం. సైబర్ మోసాలు జరిగిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలి. ఆలస్యం చేస్తే నగదు రికవరీ కష్టమవుతుంది.

– వై రవిశంకర్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

రేంజ్ ఐజీ పాలరాజుకు గోల్డ్ మెడల్



డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న ఐజీ పాలరాజు

నగరంపాలెం: అల్లర్లు సృష్టిస్తున్న సంఘ విద్రోహ శక్తులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుంది. ఈ క్రమంలో రౌడీషీటర్లపై ఉన్న కేసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయించడం, వారికి శిక్షలు పడేలా చేయడం ద్వారా కటకటాలు లెక్కిస్తున్నారు. ఇక గుంటూరు రేంజ్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల్లోని రౌడీషీటర్ల ఏరివేతపై, ఇతరత్రా నేరాలకు సంబంధించి కేసుల్లోనూ ఐజీ పాలరాజు ప్రత్యేక దృష్టి సారించిన విషయం విదితమే. ఈ క్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజుకి గోల్డ్ మెడల్ దక్కింది. శనివారం మంగళగిరి డీపీజీ కార్యాలయంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదగా ఐజీ జి.పాలరాజు గోల్డ్‌మెడల్ అందుకున్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌కు కూడా గోల్డ్‌మెడల్ దక్కగా, గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్, పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికా గర్గే, పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వర్‌రెడ్డి సిల్వర్ మెడల్స్ అందుకున్నారు. ఐజీ పాలరాజుకు పలువురు అభినందనలు తెలిపారు.

ముగిసిన వీరారాధన

పల్నాటి వీరులకు ఘనంగా వీడ్కోలు పలికిన ప్రజలు



చెన్నకేశవుని చెంత పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవతో వీరాచారవంతులు

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడి (కార్యమపూడి)లో పల్నాటి వీరారాధన ఉత్సవాలు రాత్రితో ముగిశాయి. శనివారం జరిగిన కల్లిపాడు ఘట్టంతో ఐదు రోజుల వీరారాధన ఉత్సవాలు ముగిశాయి. నాగులేరు గంగధారి మడుగు ఒడ్డున ఉదయం పల్నాటివీరుల ఆయుధాలకు వీరాచారవంతులు పూజ కట్టుకున్నారు. ఆయుధాలను అలంకరించుకున్నారు. తర్వాత పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవతో చెన్నకేశవస్వామి చెంతకు తరలివెళ్లారు. ఆయుధాలతో వీరాచారవంతులు చెన్నకేశవునికి మొక్కిన అనంతరం అర్చకుడు సత్యనారాయణాచార్యులు ఇచ్చిన తీర్థం తీసుకున్నారు. అక్కడ నుంచి అంకాలమ్మ తల్లి ఆలయానికి వెళ్లి అక్కడ కూడా శిరస్సు వంచి ఆయుధాలతో అమ్మవారిని మొక్కారు.

ఉద్విగ్నంగా లంకన్న ఒరుగు ఘట్టం

ఆలయం నుంచి ప్రధాన వీధిలోకి వచ్చాక నాగమ్మ వేషం ధరించిన శేషు అనే ఆచారవంతుడు వారికి తారసపడడం అక్కడ నుంచి నాగమ్మ వేషంలో ఉన్న ఆచారవంతుని తరుముకుంటూ పల్నాటి వీరాచారవంతులు వీరుల గుడి ఆవరణలో ఈశాన్య దిక్కున కళ్లి తోరణం వద్ద ఉన్న లంకన్న ఒరుగు వద్దకు పరుగులతో చేరుకున్నారు. బ్రహ్మనాయుడు పాత్రలో ఉన్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ నిర్జీవంగా పడి ఉన్న లంకన్నను లేపి అతనికి శంఖుతీర్థం ఇచ్చి ప్రాణ ప్రతిష్ట చేసిన సన్నివేశం ఆవిష్కృతమైంది. లంకన్నగా ఇక్కుర్తికి చెందిన ఆవుల బాలచంద్ర శనివారం ప్రారంభ ఘడియల నుంచి శవంలాగా ఉండేలా అక్కడ ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం పల్నాటి వీరాచారవంతులు పీఠాధిపతితో విషాదవదనాలతో పరుగున తరలివచ్చి లంకన్నను లేపే ఘట్టం ఉద్విగ్నంగా కొనసాగింది. తర్వాత లంకన్నను నాగులేరు గంగధారి మడుగు పడమర వైపునకు తీసుకెళ్లారు. అక్కడ లంకన్నతో స్నానం చేయించి అనంతరం వీరుల గుడికి చేరుకుని ఆయనతో కత్తి సేవ చేయించారు.

కళ్లికొరిగిన వీరుల ఆయుధాలు

అనంతరం మధ్యాహ్నం వీరుల ఆయుధాలకు నాగులేరు గంగధారి మడుగు ఒడ్డునే అలంకారాలు తీసివేశారు. ఆయుధాలను నాగులేరులో శుభ్రం చేసి వీరాచారవంతులు కూడా స్నానాలు చేశారు. చీకటి పడిన తర్వాత అక్కడ నుంచి అలంకారాలు లేని ఆయుధాలతో రణక్షేత్ర వీధుల్లో గోవింద నామ స్మరణతో పరుగులతో కలియతిరిగారు. ఆ సమయంలో చాలా మంది ప్రజలు రోడ్లపై పడుకున్నారు. వీరాచారవంతులు తమ ఆయుధాలతో వారిని దాటుకుంటూ వెళ్లారు. అలా వారంతా వీరుల గుడికి తూర్పున ఉన్న కళ్లిపోతు రాజు మండపం వద్ద ఏర్పాటు చేసిన కళ్లిమండెపై వీరుల ఆయుధాలను వాల్చారు. అప్పటికే వీరాచారవంతుల కుటుంబ సభ్యులు అన్ని సర్దుకుని ఆ ప్రాంతానికి చేరారు. వారు మళ్లీ రణక్షేత్ర పొలిమేరలోకి రాకుండా వారి స్వగ్రామాలకు పయనమయ్యారు. అనంతరం వేలాదిగా ప్రజలు తరలివచ్చి కళ్లి మండలు తీసుకుని పొలిపొలి అంటూ కేకలు పెడుతూ ఇళ్లకు చేరారు. ఐదు రోజులపాటు రణక్షేత్రంలో జరిగిన పల్నాటి వీరారాధన ఉత్సవాలు ముగిశాయి. పల్నాటి వీరాచారవంతులకు వారి ఆయుధాలకు ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు.

టెన్త్ ఎన్ఆర్ సవరణలకు 20 తుది గడువు

డీఈఓ శామ్యూల్

నరసరావుపేటఈస్ట్: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నామినల్ రోల్ (ఎన్ఆర్)లో సవరణలకు పాఠశాల విద్యాశాఖ అవకాశం కల్పించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు 2024 మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన విద్యార్థుల పరీక్ష దరఖాస్తులలో అవసరమైన సవరణలకు ఈనెల 20వ తేదీ వరకు పాఠశాల లాగిన్‌లో ఎడిట్ సౌకర్యం కల్పించినట్టు వివరించారు. అన్ని యాజమాన్యాలలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసుకొని వెబ్ అప్లికేషన్‌లో విద్యార్థుల వివరాలలో ఏవైనా సవరణలు ఉంటే వెంటనే చర్యలు తీసుకునేందుకు ఎడిట్ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థి పేరు, తల్లి, తండ్రి పేరు, పుట్టిన తేదీ, విద్యార్థి ఎంచుకొన్న మొదటి, ద్వితీయ భాష, మాధ్యమం, విద్యార్థి వైకల్యం, ఓఎస్ఎస్‌సీ సబ్జెక్/కోడ్, పుట్టు మచ్చలు, విద్యార్థి ఫోటో, సంతకం సవరణ చేసేందుకు అవకాశం ఉందని వివరించారు.

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మాచర్ల: పల్నాడు జిల్లాలో పలు పోలీసు స్టేషన్‌లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ పల్లపురాజు తెలిపారు. పట్టణంలోని అర్బన్ పోలీసు స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అర్బన్ సీఐ పి.శరత్‌బాబుతో కలసి వివరాలు వెల్లడించారు. కొనసీమ జిల్లాలోని మండపేట మండలానికి చెందిన కందుల సత్యనారాయణ చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో గుర్తించినట్లు చెప్పారు. కచ్చితమైన సమాచారం మేరకు మార్కెట్‌యార్డు సమీపంలో అరెస్ట్ చేసినట్లు వివరించారు. నవంబర్ 27వ తేదీ మాచర్ల పట్టణం, వినుకొండ, మార్కాపురంలలో తాళాలు వేసిన ఇళను టార్గెట్ చేసి బంగారు, వెండి దొంగిలించినట్లు అంగీకరించినట్లు చెప్పారు. రూ.15 లక్షల విలువైన 250 గ్రాముల బంగారం, 564 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడిపై ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలలో 50 చోరీ కేసులున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన సిబ్బందికి రివార్డులకు సిఫారసు చేసినట్లు తెలిపారు. నిందితుడ్ని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముందు రిమాండ్ నిమిత్తం హాజరు పరిచినట్లు చెప్పారు.

నేల బావిలో మృతదేహం

పెదకూరపాడు: వ్యవసాయ పొలంలోని నేల బావిలో యువకుడు మృతదేహ లభ్యమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. అచ్చంపేట ఎస్ఐ సిహెచ్.మణికృష్ణ తెలిపిన వివరాలు.. బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సంగు వీర్లవెంకటయ్య(32) గురువారం అచ్చంపేట మండలం తాళ్లచెరువు గ్రామంలోని తమ బంధువుల ఇంటికి వచ్చారు. బంధులను పరామర్శించి ఇంటికి తన ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నట్లు భార్య శ్రావణికి సమాచారం ఇచ్చాడు. కానీ గురువారం రాత్రి ఇంటికి చేరుకోకపోవడంతో బంధువులు ఇరు గ్రామాల్లో ఆచూకి కోసం గాలించారు. ఈ క్రమంలో శనివారం ఉదయం అచ్చంపేట- పెద్దపాలెం మధ్యలో మొగిలి శ్రీను వ్యవసాయ పొలంలోని బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. దీంతో స్థానికులు అచ్చంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బావిలో ఉన్న వెంకయ్య మృతదేహంతో పాటు ద్విచక్ర వాహనం కూడ వెలికితీశారు. మృతుడు తలపై గొడ్డలితో నరికిన అనవాలు కనిపించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు తండ్రి హనుమంతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మణికృష్ణ చెప్పారు. మృతుడుకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు


ఏరియా వైద్యశాలలో రెడ్‌క్రాస్, వైద్యులతో సమీక్షిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పదని, రక్త దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తం ఇవ్వాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో ఈ నెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం నిర్వహణపై శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణాలు నిలపడమేనన్నారు. ఎక్కువ మంది యువతను ఈ మెగా రక్తదాన శిబిరంలో భాగస్వాములు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. వెయ్యి మందికి పైగా రక్తదానం చేయించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సంస్థ గుంటూరు ఎండీ డాక్టర్ వై. భాస్కరరావు, డీఎఫ్ఓ కె.జానీ రసూల్, అసిస్టెంట్ మేనేజర్ టి.కిరణ్ కుమార్, సాంకేతిక పర్యవేక్షకుడు చలపతి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, వైద్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఆర్ఎంఓ డాక్టర్ శోభారాణి, పట్టణ వైద్యురాలు డాక్టర్ షకీలా శ్రీధర్‌రెడ్డి, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రామకృష్ణ, షేక్ కరీంల సలహాలు, సూచనలు స్వీకరించారు.

కార్మికులకు అండగా ఉంటా

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: కార్మికులందరికి అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి రాజీ లేని కృషి చేస్తానని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని చెక్‌పోస్టు సమీపంలోని క్వారీ, సున్నం బట్టీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు కూలి సరిపోవటం లేదని, కూలి రేట్లు పెంచాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల కష్టాలను తీర్చేందుకు వైఎస్సార్ సీపీ కృషి చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన జీఓతో ఎవరైతే క్వారీ కార్మికుల ఉన్నారో వారే యజమానులుగా కాబోతున్నారని తెలిపారు. కాయ కష్టం చేసే వారికే అగ్రస్థానంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలబెడుతుందని పేర్కొన్నారు. గతంలో అక్రమ క్వారీ నిర్వహించిన వారిపై సీబీఐ విచారణ చేస్తోందని, నిజనిర్ధారణ తేల్చి అక్రమార్కులను అరెస్టు చేసే రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. కార్మిక సంఘాల ద్వారా తమ హక్కులను సాధించుకునేందుకు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు. వచ్చే నెలలోనే బైపాస్ రోడ్డు పనులు పూర్తి కానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, ఆర్‌టీఐ మాజీ కమిషనర్ రేపాల శ్రీనివాసరావు, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు భవనాశి యల్లారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య పాల్గొన్నారు.

ఈత అత్యుత్తమ వ్యాయామం

జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట ఈస్ట్: ఈత అత్యుత్తమ వ్యాయామమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో పల్నాడుజిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం 9వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన జేసీ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ, క్రీడగానే కాక ఈత వరదలు సమయంలో ప్రాణాపాయం నుంచి కాపాడేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతిఒక్కరూ ఈతలో ప్రవేశం కలిగి ఉండాలన్నారు. పోటీలకు వివిధ జిల్లాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏపీవీ రామలింగారెడ్డి, కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఐఏఎస్, గ్రూప్ -1, 2 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

వినుకొండ(నూజెండ్ల): పట్టణ సమీపంలోని భ్రమరా టౌన్‌షిప్‌లో డాక్టర్ పారా వెంకటలక్ష్మయ్య ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐఏఎస్, గ్రూప్-1,2 శిక్షణ కేంద్రాన్ని డాక్టర్ పారా లక్ష్మయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అభ్యర్థన మేరకు జిల్లాలోని నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మోహన్‌కందా, మాజీ ప్రభుత్వ సెక్రటరీ కె.వి.సత్యనారాయణ విజువల్ పద్ధతిలో హాజరై విలువైన సలహాలు, సూచనలు అందజేశారని తెలిపారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ లక్ష్మయ్య

ఘనంగా శ్రీ విద్యా వస్త్రాలయం 8వ వార్షికోత్సవం


వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళలు

పాత గుంటూరు: గుంటూరు బ్రాడీపేట 4/2లోని ప్రముఖ వస్త్ర సంస్థ ''శ్రీ విద్యా'' వస్త్రాలయం 8వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కాంజీవరం పట్టు, డిజైనర్ శారీస్, తుషార్, బెనారస్ హ్యాండ్లూమ్స్, సూట్స్, సల్వార్ సూట్స్, కుర్తీస్, కంచిపట్టు చీరలు, కాటన్ శారీస్, ఉప్పాడ చీరలు, డ్రస్ మెటీరియల్స్, లేహంగాస్, క్రాప్ టాప్, వెస్ట్రన్‌వేర్, అనేక వస్త్రాలు నూతన డిజైన్లలో సరికొత్త స్టాక్ అందుబాటులో ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఓం ప్రకాష్ తెలిపారు. అన్ని రకాల వస్త్రాలపై పరిమిత కాలంలో 50 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు కస్టమర్లు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా వినూత్న వస్త్రశ్రేణిపై ప్రత్యేక డిస్కౌంట్స్ ఇస్తున్నట్లు ఓం ప్రకాష్ తెలిపారు.

బలహీన వర్గాలు అన్ని రంగాల్లో ఎదగాలి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

మాచవరం: బలహీన వర్గాల ప్రజలు విద్య, రాజకీయ, ఆర్థికంగా అన్ని రంగాల్లో ఎదగాలని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, శాసనమండలి విప్ జంగా కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండల కేంద్రమైన మాచవరంలో పల్నాడు జిల్లా బలహీన వర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బహిరంగ సభను శనివారం ఏర్పాటు చేశారు. గ్రామ పురవీధుల్లో బలహీన వర్గాల ప్రజలతో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక సర్పంచి రాగిడి నరేష్, దళిత యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ నగర్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలు నేటికి పలు రంగాల్లో వెనుకబడి ఉన్నారని, సమస్యల పరిష్కారానికి సమష్టిగా పోరాడదామని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు వైఎస్సార్ సీపీకి ఎంతగానో అండగా ఉండి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని ప్రశంసించారు. దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో గురజాల ఎమ్మెల్యేగా గెలిచి, నియోజకవర్గంలోని లిఫ్టు ఇరిగేషన్ పథకాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని, పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మరొకమారు గురజాల ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ షరీఫ్, నియోజకవర్గ అధ్యక్షుడు భూషణం చెన్నయ్య, పిడుగురాళ్ల జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, నాయకులు గద్దల వేదమణి, ముశ్యం వెంకటేశ్వర్లు, స్థానిక సర్పంచి రాగిడి నరేష్, అనిల్‌కుమార్, గద్దం శ్రీను పాల్గొన్నారు.